ప్రజాశక్తి
బుధవారం 26 మార్చి 2025
5
శ్రీకాకుళం

రేపు మేధో సంపత్తి హక్కులపై అవగాహన

శ్రీకాకుళం : జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కోసం మేధో సంపత్తి హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని ఎచ్చెర్లలోని అంబేద్కర్ యూనివర్శిటీలో ఈనెల 27వ తేదీ ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎంఇలకు మేధో సంపత్తి హక్కుల ప్రాముఖ్యతను వివరించడం, పేటెంట్లు, ట్రేడ్ మార్క్‌లు, కాపీరైట్లు, డిజైన్ల గురించి అవగాహన కల్పించడం, ఐపిఆర్‌ను ఎలా పొందాలి, నిర్వహించాలన్న దానిపై మార్గనిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంఎస్ఎంఇ యజమానులు, ఉద్యోగులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, పరిశోధకులు ఈ కార్యక్రమానికి ఉచితంగా హాజరు కావచ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం 9494959108 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

- సమస్యల పరిష్కారం కోసం గళమెత్తిన గిరిపుత్రులు
- గూడేల నుంచి భారీగా తరలివచ్చిన ఆదివాసీలు
- కలెక్టరేట్ వద్ద ధర్నా
- ఐటిడిఎ ఏర్పాటులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనం
- 7న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు
- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర

గిరిజనాగ్రహం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

గిరిజనుల్లో ఆగ్రహం పెల్లుబికింది. తమ సమస్యలపై అనేకరూపాల్లో ఆందోళన చేసినా ప్రభుత్వం చలించకపోవడంతో, పోరాటాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించారు. ఐటిడిఎ ఏర్పాటు, జిఒ నంబరు 3 అమలు, ఐదో షెడ్యూల్‌లో గ్రామాల చేర్పు వంటి డిమాండ్లతో ఆదివాసీ గిరిజన సంఘం ఇచ్చిన 'చలో కలెక్టరేట్'కు భారీగా తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా గిరిజనులు గూడేల నుంచి వాహనాల్లో కలెక్టరేట్‌కు చేరుకున్నారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని, గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం అక్కడ నుంచి జ్యోతిరావు పూలే పార్కు వద్ద ఏర్పాటు చేసిన ధర్నా శిబిరానికి చేరుకున్నారు.

జిల్లాల విభజన తర్వాత ఐటిడిఎ లేని శ్రీకాకుళంలో దాన్ని ఏర్పాటు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చాలా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర విమర్శించారు. చలో కలెక్టరేట్‌లో భాగంగా నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. డబుల్ ఇంజిన్ సర్కారు అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐటిడిఎను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం కనీసం తీర్మానం కూడా చేయకపోవడం గిరిజనులపై వారికున్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందని విమర్శించారు. జిల్లాకు చెందిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ విషయంలో ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని గిరిజనులు చాలా ఏళ్లుగా పోరాడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని, దీంతో గిరిజనుల భూములకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. బూర్జ మండలంలో గిరిజనులు నివసిస్తున్న ప్రాంతాల్లో థర్మల్ పవర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసి సహజ వనరులను కొల్లగొట్టాలని చూస్తున్నారని చెప్పారు. పెట్టుబడిదారులు, భూస్వాములు 1/70 చట్టం రాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో గిరిజనుల శ్మశానవాటిక భూములనూ ఆక్రమించుకుంటున్నారని చెప్పారు. జిసిసి ద్వారా చింతపండు, చీపుర్లను కొనుగోలు చేయకపోవడం, గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో చాలా గిరిజన గ్రామాలు ఇప్పటికీ తాగునీరు, రోడ్లు వంటి కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారం ఏప్రిల్ ఏడో తేదీన తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఐదో షెడ్యూల్‌లో చేర్చాలి

జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు విమర్శించారు. ధర్నా శిబిరానికి హాజరై సంఘీభావం ప్రకటించిన అనంతరం ఆయన మాట్లాడారు. గిరిజనుల భూములు గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒడిశా రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో గిరిజనులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నీమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించాలన్నారు. ఏజెన్సీ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చి, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీడిపంటకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

గిరిజనుల పోరాటానికి విరాళం

తమ సమస్యల పరిష్కారం కోసం గిరిజనుల సాగిస్తున్న పోరాటానికి సంఘీభావంగా మధ్యతరగతి, ఉద్యోగ సంఘాల నాయకులు కె.శ్రీనివాసు రూ.పది వేలు విరాళం అందించారు. గిరిజనులకు మాయమాటలు చెప్పి మోసగిస్తుంది ఎవరో, వారి కోసం నిఖార్సైన పోరాటం చేస్తోంది ఎవరో గుర్తించాలన్నారు. పోరాటాలతోనే హక్కులు సాధించుకోగలమన్నారు. గిరిజనుల పోరాటానికి సిపిఎం, వామపక్షాలు, ఇతర అన్ని ప్రజాసంఘాలు బాసటగా ఉంటాయని హామీనిచ్చారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, సంఘ నాయకులు సవర కృష్ణ, సవర సింహాచలం, అప్పలనాయుడు, కృష్ణ, సవర గురునాథ్, సవర ధర్మారావు, సవర ఫల్గుణ, మందస మండలం మాజీ జెడ్‌పిటిసి సభ్యులు సవర లకియా, బాతుపురం సర్పంచ్ హరీష్, నౌగూడ సర్పంచ్ సబిత, రుషి, జయరాం, సింహాచలం, బాడంగి సురేష్ ప్రజా, కార్మిక పలు పౌరసంఘాల నాయకులు భవిరి కృష్ణమూర్తి, కె.మోహనరావు, షణ్ముఖరావు, తేజేశ్వరరావు, ఎస్.లక్ష్మీనారాయణ, కె.నాగమణి, సిర్ల ప్రసాదరావు తదితరులు ఆయా సంఘాల తరుపున మద్దతు తెలియజేసి మాట్లాడారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అందించారు.

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర

విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వాన నిర్వహిస్తున్న రెండు రోజుల కలెక్టర్లు, ఎస్‌పిల సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి.
- ప్రజాశక్తి, అమరావతి

నిరసన ప్రదర్శన చేపడుతున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల సస్పెన్షన్లు ఎత్తివేయాలి

- డిఇఒను విధుల నుంచి తొలగించాలి
- ఉపాధ్యాయ సంఘాల ర్యాలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ స్కూల్‌లో పదో తరగతి పరీక్షల మాస్ కాపీయింగ్ పేరుతో 14 మంది ఉపాధ్యాయులపై విధించిన సస్పెన్షన్లను ఎత్తివేయాలని ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యాన నగరంలోని ఏడు రోడ్ల జంక్షన్ నుంచి జి.టి రోడ్డు మీదుగా జిల్లా విద్యాశాఖ కార్యాలయం వరకు మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా స్టీరింగ్ కమిటీ నాయకులు చౌదరి రవీంద్ర, మజ్జి మదన్‌మోహన్, తంగి మురళీమోహన్ మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులపై కక్షసాధింపు చర్యలను అవలంబిస్తున్న డిఇఒ తిరుమల చైతన్యను వెంటనే బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కుప్పిలి మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో డిఇఒ, ఎచ్చెర్ల ఎంఇఒ ఉద్దేశపూర్వకంగా కక్షసాధింపు చర్యలను అవలంబించి హడావుడి చేశారని చెప్పారు. మాస్ కాపీయింగ్ జరిగిందని చెప్తున్న డిఇఒ స్లిప్‌లు ఎక్కడ పట్టుకున్నారో చెప్పాలన్నారు. దొరికాయని చెప్తున్న స్లిప్‌ల్లో ఉన్న అంశాలను జవాబు పత్రంలో ఎక్కడైనా రాసినట్లు ఆధారాలు ఉంటే చూపాలని డిమాండ్ చేశారు. ఉద్దేశపూర్వకంగా విద్యార్థులు, ఉపాధ్యాయులపై అమానుషంగా ప్రవర్తించిన తనిఖీ బృందంపై చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద కాకుండా జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఉన్న ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

విద్యార్థులను పరీక్షలు రాయనీయకుండా గంట కాలం పాటు వృథా చేసినందుకు తనిఖీ బృందం సభ్యులు ఏమని సమాధానం చెప్తారని ప్రశ్నించారు. ఉపాధ్యాయులపై పెట్టిన క్రిమినల్ కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డిఇఒ తిరుమల చైతన్య అక్రమాలపై శాఖాపరమైన విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. అన్యాయంగా డిబార్ అయిన విద్యార్థులను బేషరతుగా పరీక్షలకు అనుమతించాలన్నారు. డిఇఒను రిలీవ్ చేయాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎస్.కిషోర్ కుమార్, గొంటి గిరిధర్, పొందూరు అప్పారావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి, డిటిఎఫ్ నాయకులు పేడాడ కృష్ణారావు, ఎం.కృష్ణయ్య, ఎస్‌టియు నాయకులు జి.రమణ, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దుకాణాన్ని పరిశీలిస్తున్న వెంకటరత్నం

అపరిశుభ్ర ఆహారం విక్రయిస్తే కఠిన చర్యలు

ఆహార నియంత్రణ అధికారి కె.వెంకటరత్నం

ప్రజాశక్తి - గుజరాతీపేట

అపరిశుభ్రంగా ఉన్న ఆహారాన్ని ప్రజలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆహార నియంత్రణ అధికారి కె.వెంకటరత్నం హెచ్చరించారు. నగరంలోని ఇలిసిపురం మెయిన్ రోడ్డులో గల హోటల్ అయ్యప్ప ఫుడ్ ఎక్స్‌ప్రెస్‌ను మంగళవారం పరిశీలించారు. చికెన్, ఇతర నాన్‌వెజ్, విజిటేరియన్స్ ఆహార పదార్థాల్లో రంగులు కలిపినా, చైనా సాల్ట్ వినియోగించినా, అపరిశుభ్ర ప్రదేశంలో ఆహార పదార్థాలు విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడకుండా నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే విక్రయించాలన్నారు. ఐస్ కలిపే పళ్లరసాలను సేవించకూడదన్నారు. కార్యక్రమంలో ఆహార నియంత్రణ సహాయ అధికారి కె.లక్ష్మి పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



పౌరసరఫరాల శాఖ పరిధిలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు తాత్కాలిక ప్రాతిపదికన నియమించేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి జి.సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు నగరపాలక సంస్థ పరిధిలో నివాసం ఉండి డిగ్రీ ఉత్తీర్ణత, కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు కంప్యూటర్ విద్యార్హత పొంది ఉండాలని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విద్యార్హత ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ రెండో తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 6న దరఖాస్తుల పరిశీలన అనంతరం ఇంటర్వ్యూ నిర్వహిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు అభ్యర్థి ఫొటో, విద్యార్హత జిరాక్స్ కాపీలు, నివాస, పదో తరగతి ఉత్తీర్ణత, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని తెలిపారు. దరఖాస్తుదారులు 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన వారు నగరంలోని మార్కెట్‌లోని మూడు కిరాణా దుకాణాల్లో 22 నిత్యావసర వస్తువుల టోకు, చిల్లర ధరలను, 16 రకాల నిత్యావసర వస్తువుల చిల్లర ధరలను సేకరించి ప్రతిరోజూ మెయిల్ ద్వారా కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్, పౌరసరఫరాల కమిషనర్ వెబ్‌సైట్‌కు పంపాల్సి ఉంటుందని తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఎంపికైన వారికి నెలకు రూ.24 వేలు వేతనం, రూ.500 నెట్ ఛార్జీలు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

ప్రజాశక్తి - కవిటి

మాటాడుతున్న ప్రభుత్వ విప్ అశోక్

విద్యా వ్యవస్థపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ విద్యాశాఖ అధికారులకు సూచించారు. నాలుగు మండలాల విద్యాశాఖ అధికారులతో మండలంలోని రామయ్యపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ నంబరు 117 ఉపసంహరణతో క్షేత్రస్థాయిలో కలిగే ప్రయోజనాలు ప్రజలకు తెలియజేసేలా సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటీవల విద్యా వ్యవస్థలో చేపడుతున్న నూతన సంస్కరణలతో కలిగే లాభాలను ప్రజలకు వివరిస్తూ వారిలో చైతన్యం కలిగించాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తూ ఫౌండేషన్ పాఠశాలలు, మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలు ప్రజలకు సవివరంగా తెలియజేయాలన్నారు. సమావేశంలో ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రత్యేక అధికారి పద్మావతి, నాలుగు మండలాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎపిపిఎస్‌సి పరీక్షలు ప్రశాంతం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

పరీక్షలను పరిశీలిస్తున్న డిఆర్ఒ వెంకటేశ్వరరావు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) మూడు విభాగాల పోస్టులకు సంబంధించిన నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆధారిత పరీక్షలు తొలిరోజు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, విశ్లేషకుడు గ్రేడ్-2, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులకు ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో నిర్వహించిన పరీక్షకు ఉదయం సెషన్‌లో వంద మంది విద్యార్థులకు గానూ 50 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 68 మంది అభ్యర్థులకు గానూ 41 మంది గైర్హాజరయ్యారు. శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో నిర్వహించిన పరీక్షకు ఉదయం సెషన్‌లో 124 మంది అభ్యర్థులకు గానూ 56 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 69 మంది అభ్యర్థులకు గానూ 31 మంది గైర్హాజరయ్యారు. నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీలో నిర్వహించిన పరీక్షకు 319 మంది అభ్యర్థులకు గానూ 171 మంది గైర్హాజరయ్యారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కాలేజీ పరీక్షా కేంద్రం వద్ద భద్రత, వైద్య సదుపాయాలు, విద్యుత్ సరఫరా, రవాణా సౌకర్యాలు, పరీక్షలు జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించారు.

అరసవల్లి హుండీ ఆదాయం రూ.61.93లక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో ఆలయ ఇఒ వై.భద్రాజీ, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, అనువంశిక ధర్మకర్త జోగి సన్యాసిరావు పర్యవేక్షణలో లెక్కింపు సాగింది. ఆలయంలో ఉన్న 14 హుండీలకు గానూ తొమ్మిది హుండీలను మాత్రమే లెక్కించారు. మగిలిన ఆరు హుండీలను గురువారం తెరవనున్నారు. తెరిచిన హుండీల ఆదాయం రూ.61,93,916 కాగా 28 గ్రాముల బంగారం, 2.400 కిలోల వెండి, విదేశీ కరెన్సీ లభించినట్లు ఆలయ ఇఒ వై.భద్రాజీ తెలిపారు.

నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తంగా ఈ నెల 26న పలాస నియోజకవర్గ పరిధిలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ఫ్యూషియన్ ఫైనాన్స్ లిమిటెడ్, సంస్థలో రిలేషన్‌షిప్ ఆఫీసర్ అండ్ ఎస్ఆర్ పోస్టులకు ఎంపిక చేపడుతున్నట్లు తెలిపారు. ఇటంర్ విద్యార్హతతో 21 నుంచి 34 ఏళ్ల మధ్య వయసు గల పురుషులు, స్త్రీలు దరఖాస్తు చేసుకోవచ్చనన్నారు. ఎంపికైన వారికి రూ.15 వేలు వేతనం అందజేస్తారని తెలిపారు. శ్రీకాకుళం, రాజాం, అనకాపల్లి, పెందుర్తి, నర్సీపట్నం, బొబ్బిలి, పార్వతీపురం కేంద్రాల్లో పని చేసేందుకు వీలుందన్నారు. అలాగే శ్రీ సిటీలోని బ్లూస్టార్, యూనికార్న్‌లో ఆపరేటర్ ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. బ్లూస్టార్‌లో పనిచేసేందుకు 10 నుంచి డిగ్రీ మధ్య చదువు ఉండాలన్నారు. 18 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. వారికి నెలకు రూ.15,500 వేతనం చెల్లిస్తారని వివరించారు. యూనికార్న్‌లో మహిళలా అభ్యర్థులే అవసరమని తెలిపారు. 8 నుంచి డిగ్రీ వరకు చదువుకున్న ఎవరైనా ఇందులో చేరేందుకు అర్హులన్నారు. 18 నుంచి 33 ఏళ్ల మధ్య వయసు కలిగిన వారికి రూ.14 వేల వేతనంతో నియామకాలు చేపడతారన్నారు. ఎంపికకు హాజరయ్యే అభ్యర్థులు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్, రెండు పాస్ ఫొటోలు, బయోడేటాతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాల కోసం నాగేశ్వరరావు 8106508318 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

జీడిపిక్కలకు మద్దతు ధర కల్పిస్తాం

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి - పలాస

జీడిపిక్కలకు మద్దతు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గలోని ఒక కళ్యాణ మండపంలో ఉద్యానశాఖ ఆధ్వర్యాన జీడి, కొబ్బరి పంటలపై రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు సహకారంతో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిని కలిసి జీడి, కొబ్బరి రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పలాసలో జీడి, సోంపేటలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. జీడి పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. అధికారులు ఇచ్చిన శిక్షణతో సాంకేతిక పరిజ్ఞానం జోడించి పంటలపై మెళకువలు నేర్చుకోవాలని రైతులకు సూచించారు. జీడి, కొబ్బరి రైతులను ఆదుకునే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు. జీడి పంటలపై అవగాహన కల్పించేందుకు ఉద్యానవన శాఖ అధికారులు పలాస, వజ్రపుకొత్తూరు, మండలాల్లో మరో రెండు రోజులు పర్యటించి పంటలపై తగు సూచనలు ఇవ్వనున్నారని తెలిపారు. జీడి రైతులతో పాటు వ్యాపారుల కూడా ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సులో జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆర్.వి.వి ప్రసాద్, పలాస పిసిఎంఎ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్త, వ్యవసాయ శాస్త్రవేత్తలు కె.ఉమామహేశ్వరరావు, జి.సావిత్రి, హరికుమార్, ఎస్.అనూష, ఉద్యానశాఖ అధికారులు కె.శైలజ, శంకర్ దాస్, సునీత తదితరులు పాల్గొన్నారు.

పటిష్టవంతంగా పోక్సో చట్టం అమలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న న్యాయమూర్తి భాస్కరరావు

లైంగిక నేరాల నుంచి చిన్నారులను రక్షించడానికి పోక్సో చట్టం పటిష్టవంతంగా అమలు చేయాలని ఒకటో అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి పి.భాస్కరరావు అన్నారు. నగరంలోని శాంతినగర్ కాలనీలోని గిరిజన విద్యార్థుల వసతిగృహంలో లైంగిక వేధింపుల నివారణ చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులను మాయమాటలతో నమ్మించి శ్రేయోభిలాషులుగా, బంధువులుగా, పరిచయస్తులుగా, సన్నిహితులుగా ఉంటూ చెడు చేష్టలకు ప్రయత్నిస్తున్న వారిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సమాజంలో పిల్లలపై అనేక నేరాలు జరుగుతున్నాయని, కొందరు అశ్లీల ప్రయోజనాల కోసం పిల్లలను ఉపయోగిస్తున్నారని చెప్పారు. సదస్సులో న్యాయవాదులు జి.ఇందిరా ప్రసాద్, ఎ.రాజారావు, హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఆర్.అప్పలస్వామి, జి.కృష్ణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

విద్యా సదస్సును విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- సోంపేట

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఈ నెల 31న శ్రీకాకుళంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో విద్యా సదస్సు నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణలలో భాగంగా తీసుకొచ్చిన జిఒ 117 వల్ల పాఠశాల విద్యావ్యవస్థ విచ్ఛిన్నమైందన్నారు. 12,512 ప్రాథమిక పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడే పనిచేస్తున్నారని తెలిపారు. ఒకే మీడియం ప్రవేశపెట్టడం వల్ల విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా జిఒ 117 రద్దని చెపుతూ, దాని సారాన్నే అమలు చేస్తుందని అన్నారు. దీనివల్ల 1,2 తరగతుల ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలలు కనుమరుగు అవుతున్నాయని అన్నారు. జిల్లా కార్యదర్శి మురళీప్రకాష్ మా ట్లాడుతూ నూతన కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు పూర్తయినా 12వ పిఆర్‌సి చైర్మన్‌ని నియమించలేదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మాధవరావు, కంచిలి అధ్యక్షులు మురళి నాయకో, సుదర్శన్ బెహరా, రవి నల్లానా, సోంపేట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుర్మారావు, దొరబాబు, ఇచ్ఛాపురం అధ్యక్షులు శ్రీను పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

కవిటి: అన్యాయంగా ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారని, ఉద్దేశపూర్వకంగా చేసిన ఈ అక్రమ సస్పెన్షన్ రద్దు చేసి డిఇఒపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని మండల ఉపాధ్యాయ సంఘ సమాఖ్య డిమాండ్ చేసింది. జిల్లా సమాఖ్య పిలుపుమేరకు మండలంలోని కొన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై తమ నిరసన తెలియజేశారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.మురళీప్రకాష్ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి నిరంకుశ వైఖరి నశించాలన్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు.

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కళారంగంలో కలికితురాయి కుమార్‌నాయక్

- రంగస్థలంలో రాణిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి
- నేడు ప్రపంచ రంగస్థలం దినోత్సవం

ప్రజాశక్తి- పలాస

భారతీయ సాహిత్యం నుంచి పుట్టిన రమనీయ వాక్యం 'కావ్యేసు నాటకం రమ్యం' జీవితమే ఒక రంగస్థలం అయితే అందులో ప్రతి మనిషీ ఒక పాత్రధారుడే. హెలెన్ స్కి జాతీయుడైన ఆర్వి కివిమా 1961 మార్చి 27న వియాన్నాలో మొట్ట మొదటిసారి 'ప్రపంచ రంగస్థల దినోత్సవం' పేరిట ఒక వేడుక జరిపాడు. నాటి నుంచి రంగస్థలానికి ప్రపంచదేశాలు అమలుకు శ్రీకారం చుట్టాయి.

కళామతల్లి సేవలో నిమగ్నమైన కుమార్ నాయక్ ఒక సామాన్య రైతు కుటుంబంలో 1961లో జన్మించారు. రాజనీతి శాస్త్రం బీసామాజిక శాస్త్రంలో డబల్ ఎంఎలో పట్టభద్రులు. జానపదుల జాడ నేడు యాడున్నదో అను అంశంపై రీసెర్చ్ చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. తన 14వ ఏట 9వ తరగతి చదువుతున్న సమయంలో కోయడాన్స్ ట్రూపులో చేరి కాలి అందియలకు మువ్వలు కట్టారు. కోలాటంబీ చెక్క భజనలు , గ్రామ దేవత ఉత్సవాలు, సంక్రాంతి పండగలో పగటి వేషాలతో ప్రారంభమైన కళారంగ ప్రస్థానం ప్రస్తుత

నటిస్తున్న కుమార్‌నాయర్
(ఇన్‌సెట్‌లో కుమార్ నాయక్)

అవార్డును అందుకుంటున్న కుమార్ నాయక్

నటుడిగా, దర్శకునిగా, సందర్భాచిత రచయితగా, న్యాయ నిర్ణేతగా కళామతల్లి సేవలో ఉన్నారు.

సన్నాసోడి పెళ్లాం, జాలారి జంగమయ్య, సూరి గాడికి చదువొచ్చే, కంచం కాదంటుంది సదువు రాని సర్పంచ్, లంకె బిందెలో లక్కాయి పిక్క, కోయదొర కొంటె దంపతులు, చిలక జోస్యం, సోది చెబుతాను, భైరవకోన, చీడపురుగులు, కొత్త చిగురు, నాటు మందు, పిడికిలి, విజన్-420, ట్రీట్మెంట్, నీతి నీ స్థానం ఎక్కడ? కొడుకు పుట్టాలా? దాడి నాటికలు నాటకాల్లో నటునిగా, దర్శకునిగా ప్రతిభ కనబరిచారు.

ప్రశంసలు...

నాగాలాండ్ గవర్నర్ గణేషన్, ఒడిశా మాజీ సిఎం గిరిధర్ గమంగో, అవధాని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ, స్వాతంత్ర సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య, వాగ్గేయ కళాకారుడు యుద్ధ నౌక గద్దర్, అప్పటి శ్రీకాకుళం కలెక్టర్లు బి.డి.దానం, అనిల్ చంద్ర పునేట, ఉమ్మడి రాష్ట్ర మంత్రులు తమ్మినేని సీతారాం, పల్లె రఘునాథ్‌రెడ్డి, గౌతు శ్యామసుందర శివాజీ, ప్రస్తుత మంత్రి సీదిరి అప్పలరాజు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

నవోదయలో మెరిశారు

సృజన్

అనీష్

రోహిత్

నిహాంత్

నందకిషోర్

టెక్కలి : జవహర్ నవోదయ వెన్నెలవలస పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశం సందర్భంగా విడుదలైన ఫలితాల్లో టెక్కలి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. టెక్కలి కలాం ఆదర్శ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన అడ్డాల మనోహ డేనియల్, గౌడ వేదవ్యాస, ఉర్లాపు నాగచైతన్యలు ప్రతిభ కనబరిచారని కోచింగ్ సెంటర్ డైరెక్టర్ బి.సురేష్‌కుమార్ తెలిపారు. తమ కోచింగ్ సెంటర్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడంపై కో-డైరెక్టర్ పి.వై.నాయుడు అభినందించారు. అలాగే స్థానిక విజ్ఞాన్ యుపి స్కూల్‌లో చదువుతున్న సృజన్ సాహిత్య నవోదయలో ప్రతిభ కనబరిచి స్థానాన్ని సంపాదించుకున్నారని పాఠశాల కరస్పాండెంట్ బి.రాజశేఖర్ తెలిపారు. విద్యార్థికి శిక్షణ ఇచ్చిన గేదెల తిరుపతిరావుని అభినందించారు.

కవిటి: కవిటి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న అదే గ్రామానికి చెందిన పార్నంది అక్షయ్ రూప్ శర్మ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు మంగళవారం విడుదలైన ఫలితాల్లో తమ బాబు నవోదయకు ఎంపికైనట్టు తెలిసిందని విద్యార్థి తల్లిదండ్రులు పార్నంది ప్రసాద్, లక్ష్మీదేవి తెలిపారు. దీనిపై వారు హర్షం వ్యక్తం చేస్తూ శర్మకు మిఠాయిలు తినిపించారు. ఎంఇఒ ధనుంజయ మజ్జి, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయులు బెందాళం వరలక్ష్మి, ఉపాధ్యాయుడు భగవాన్ విద్యార్థికి అభినందనలు తెలియజేశారు.అదే విధంగా జాడుపూడి ఆర్ఎస్ విజేత పాఠశాలలో చదువుతున్న విద్యాశ్రీ సాహు నవోదయకు ఎంపికైనట్టు తల్లిదండ్రులు రమేష్ సాహు, సుస్మిత సాహు తెలిపారు.

నందిగాం : మండలం కాశీరాజపురానికి చెందిన తమ్మినాన అనీష్ నవోదయ గురుకులానికి ఎంపికైనట్లు తల్లిదండ్రులు టి.వల్లభరావు, టి.త్రివేణిలు తెలిపారు అనీష్ పలాసలోని ఓ ప్రయివేటు పాఠశాలలు చదువుతున్నాడని అన్నారు.

సరుబుజ్జిలి : వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించి మండల కేంద్రంలోని నందికొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థి బెండి రోహిత్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వివేక్ సుధ తెలిపారు. నవోదయలో సీటు సాధించడంపై రోహిత్‌ను సిఆర్ఎంటి బెండి చిన్నారావు అధ్యాపకులు మోహిని శ్రీనివాసరావు అభినందించారు.

కవిటి : అక్షయ్‌కు మిఠాయి తినిపిస్తున్న తాతయ్య

పొందూరు: పొందూరు మానస వేణి హైస్కూల్‌కు చెందిన విద్యార్థి కె.నిహాంత్ మంగళవారం విడుదలైన జవహర్ నవోదయ ఫలితాల్లో తన ప్రతిభను చాటాడు. ఈ ఏడాది జనవరి 18న నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఇందులో ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యాడు. ఎంపికైన విద్యార్థిని ఎంఇఒలు జి.శ్రీరాములు, పి.రాజారావు, పాఠశాల డైరెక్టర్ ఎంఆర్ఆర్ సిహెచ్.కుమార్, కరస్పాండెంట్ ఎం.సంతోష్‌కుమార్, ప్రిన్సిపాల్ జి.ఈశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

జలుమూరు : మండలంలోని తిమడాం గీతాంజలి పాఠశాలకు చెందిన సిమ్మ నంద కిషోర్ నవోదయ స్కూల్‌కి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెలమల రామచంద్రరావు తెలిపారు. విద్యార్థిని అభినందించారు.

నిర్మానుష్య ప్రదేశాల్లో డ్రోన్ నిఘా

ప్రజాశక్తి- గుజరాతీపేట

పేకాట, కోడి పందేలు నిర్వహణ, బహిరంగా మద్యం గంజాయి వినియోగం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు అరికట్టేందుకు శ్రీకాకుళం గ్రామీణ శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల నిఘా పెట్టామని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. శ్రీకాకుళ: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో తండేవలస, సిద్ధిపేట, పాత్రునివలస, జాతీయ రహదారి మార్గాన ఇరువైపులతో పాటు పలు గ్రామీణ ప్రదేశాలు, పాడైన బంగ్లాలు, తోటలపై మంగళవారం డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగ మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ ఇతర నేరాలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. బహిరంగంగా మద్యం సేవించడం గంజాయి వినియోగించిన, పేకాట, ఈవ్ టీజింగ్ తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినవారు పట్టుబడినట్లయితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పన్ను చెల్లింపుదారులకు శుభవార్త

ఇచ్ఛాపురం: ఆస్తి, ఖాళీస్థలం పన్ను వడ్డీ మాఫీ ఈ నెల 31 వరకు అవకాశం ప్రభుత్వం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పన్నుల బకాయిలను ఒక్కసారి చెల్లిస్తే 50 శాతం వడ్డీ మాఫీ చేస్తున్నామని అన్నారు. ఇచ్ఛాపురం పురపాలక సంఘ పరిధిలోని చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఇందుకోసం పురపాలక సంఘ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. సెలవు రోజుల్లోనూ పన్నులు స్వీకరిస్తామన్నారు. అలాగే వార్డు సచివాలయాల్లో, ఆన్‌లైన్ ద్వారా, చెక్కులు, డిడిలు ద్వారా చెల్లించి రసీదు పొందాలన్నారు.

ఆమదాలవలస : పురపాలక సంఘంలోని ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు బకాయిదారులు ఈ నెలాఖరులోగా పన్ను మొత్తాన్ని ఏకకాలంలో చెల్లిస్తే వడ్డీ మొత్తంలో 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ తెలిపారు.

సామగ్రిని అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

'బిగ్ హెల్ప్' చేయూత

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 15 మంది విద్యార్థులకు విద్యార్థులకు బిగ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ కాస్మోటిక్ వస్తువులు, పౌష్టికాహారం వస్తువులను మంగళవారం అందజేశారు. ఒక్కొక్కరికి రూ.600 చొప్పున వస్తువులను హెచ్‌ఎం భాను ప్రకాష్ ఆధ్వర్యాన బిగ్ హెల్ప్ ప్రాజెక్ట్ చైర్మన్ రాజా, డైరెక్టర్ జయ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు గోపాలకృష్ణ విద్యార్థులకు అందజేశారు. రాబోయే విద్యా సంవత్సరంలో మరో 56 మంది విద్యార్థులను దత్తత తీసుకుని విద్యాభ్యాసానికి సహాయం అందిస్తామని ప్రకటించారు. 90 శాతం దాటిన పదో తరగతి విద్యార్థులకు మెరిట్ అవార్డులు పొందేందుకు బిగ్ హెల్ప్ ఫర ఎడ్యుకేషన్ సైట్లో నమోదు చేసుకుంటే లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు.

స్కాలర్‌కు 'పద్మావతి' విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి- నరసన్నపేట

నాజ్ పర్వీన్

స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థిని నాజ్ పర్వీన్ ఆదిత్య బిర్లా క్యాపిటల్ స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యిందని కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ స్కాలర్ ద్వారా రూ.54 వేలు విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని అన్నారు. ఇంటర్ మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా ఈ స్కాలర్‌కు ఎంపిక చేసినట్టు తెలిపారు. కళాశాల చైర్మన్ పల్లి సూరిబాబు, అకడమిక్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు అభినందించారు.

ఎంపికైన కాకినాడ విద్యార్థులు

106 మంది విద్యార్థుల ఎంపిక

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉన్న కాకినాడఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుతున్న 106 విద్యార్థులు సాఫ్ట్‌వేర్ సంస్థ విప్రో టెక్నాలజీస్‌లో ఉద్యోగాలు సాధించారు. సంస్థ ప్రతినిధులు మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో వీరు అర్హత సాధించారు. ఎంపికైన వీరికి రూ.2.5 లక్షల వార్షిక వేతనం అందజేయనున్నట్టు అకడమిక్ డైరెక్టర్ బి.వి.ఎల్.నాయుడు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణా రెడ్డి, కళాశాల చైర్మన్ ఎన్?శేషారెడ్డి, డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ జి.జి.వి.సుబ్రహ్మణ్యం, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఆర్.రాజు అభినందించారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి

పొందూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని తాడివలస క్లస్టర్ చైర్మన్ బల్ల కంటయ్య అన్నారు. మండలంలోని లైదాం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఓటమిని ఒప్పుకోవద్దని, ప్రయత్నాలు విరమించవద్దని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం బలివాడ వెంకటేశ్వర్లు, డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, పాఠశాల సిబ్బంది, మండల వనరుల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

ప్రజాశక్తి- కవిటి

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరని మేజర్ పంచాయతీ కవిటి ఎగ్జిక్యూటివ్ అధికారి వీరభద్రస్వామి తెలిపారు. కవిటి సచివాలయంలో బుధవారం ఆధార్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కవిటి సచివాలయంలో నాలుగు రోజులపాటు ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారులు, ఇంతవరకూ ఆధార్ అప్‌డేట్ చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వజ్రపుకొత్తూరు: ప్రతి రేషన్‌కార్డుదారులు ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని డిటి మురళీకృష్ణ అన్నారు. తహశీల్దార్ ఛాంబర్‌లో డీలర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 31 వరకు సమయం ఉందన్నారు. డీలర్లు అందరూ వారికి ఇచ్చిన జాబితాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇకెవైసి నమోదు కాని వారికి ప్రభుత్వ పథకాలు దూరమయ్యే అవకాశం ఉందన్నారు.



కవిటి : పరిశీలిస్తున్న ఇఒ వీరభద్రస్వామి

కొత్తూరు : శిక్షణలో పాల్గొన్న అంగన్వాడీలు

అంగన్వాడీలకు శిక్షణ

బూర్జ : మండలంలోని పాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు మంగళవారం వన్ చేతన్ విధి విధానాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగి ఉన్న ఆహార పదార్థాలు గురించి వివరించారు. ముఖ్యంగా గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అవసరమైన ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సిడిపిఒ గీతా రాణి ఆదేశాల మేరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ శిక్షణలో సూపర్‌వైజర్లు పి.రత్నం, ఎం.జానకమ్మ, హెచ్‌ఎం ప్రదీప్ పాల్గొన్నారు.

కొత్తూరు : పోసాన్ బి పడాయి బి శిక్షణ కార్యక్రమంలో భాగంగా హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాలకు చెందిన మినీ అంగన్వాడీ కార్యకర్తలకు మెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లింగాల శాంతకుమారి శిక్షణ ఇచ్చారు. బాల్య సంరక్షణ విద్య, ప్రోత్సహించడం అంగన్వాడీల అభివృద్ధి, ఫీడింగ్ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గౌస్య బేగం, సుధావాణి, ఈశ్వరమ్మ, వరదరాజులు, సరస్వతి, భవాని పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విస్తృత పర్యటన

ప్రజాశక్తి- అరసవల్లి

శ్రీకాకుళం రూరల్ మండలం కిల్లిపాలెం ప్రాంతంలో చెరువులు, సాగునీటి కాలువలు, డ్రెయినేజీలు, సిసి రోడ్లను ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం పర్యటించారు. రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువుల పరిరక్షణ, సాగునీటి కాలువలు పనులు సకాలంలో చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చెరువులు పనులు చేపడితే సాగునీటి కోసం కొంత ఉపకరిస్తాయని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, సిసి రోడ్ల నిర్మాణాలు పూర్తిస్థాయిలో చేపడతామన్నారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ కమిషనర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే విశాఖ ఎ కాలనీలో డ్రెయినేజీలు, కాలువల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

వడగాల్పులపై అప్రమత్తం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఉష్ణోగ్రతలు ఎక్కువ నమోదై వడగాల్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల జారీ చేసిందని, ఈ నేపథ్యంలో సంస్థలు, దుకాణాలు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పరిశ్రమలు, సంస్థలు, కర్మాగారాలు, వర్క్‌షాప్‌లు, ఇటుక బట్టీలు, భవన నిర్మాణ కార్మికులపై ఎండ తీవ్రత ప్రతికూల ప్రభావం పడకుండా చూడాల్సిన బాధ్యత యజమానులపై ఉందన్నారు. కష్టతరమైన పనులు చేసే కార్మికులకు పని వేళలు రీ షెడ్యూలు చేయాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్మికులను పనికి దూరంగా ఉంచడాలన్నారు. .

సోంపేట : ప్రారంభిస్తున్న గోపీకిరణ్

చలివేంద్రాల ప్రారంభం

ఆమదాలవలస : వేసవి కాలంలో దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు వినియోగించుకోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీత అన్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ కూడలి వద్ద ఉన్న మున్సిపల్ షాపుల సముదాయం ముందు మంగళవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యాలయ సమన్వయ కార్యదర్శి మొదలవలస రమేష్, పి.వి.వి.కె.రాజు, మహిళా అధ్యక్షులు బోయిన సునీత, బోయిన బి.రమణమూర్తి, శిల్లా గుర్నాథరావు పొట్నూరు హరి, శివ పాల్గొన్నారు.

సోంపేట : పట్టణంలోని స్టేట్ బ్యాంకు కూడలి వద్ద స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వి.గోపీకిరణ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో బాటసారులకు ఉపయోగకరంగా ఉండేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు బెల్లాన సుమన్, క్రాంతి, ఎం.కృష్ణ, పింటూ, సుజిత్, దిలీప్, ఈశ్వరరావు, తెలిపారు.

ఆక్సిజన్ కాన్సంట్రేటర్ వితరణ

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ప్రభుత్వం పిహెచ్‌సిలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గౌతు లచ్చన్న బడుగు బలహీన వర్గాల సంస్థ (గ్లో సంస్థ) ఆధ్వర్యాన మంగళవారం ఆక్సిజన్ కాన్సంట్రేటర్ వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి తన సొంత నిధులతో గ్లో సంస్థ ఆక్సిజన్ కాంసెంట్రేటర్ వితరణగా అందజేశారని అన్నారు. మాతృ, శిశు మరణాలు తగ్గించి మెరుగైన సమాజం కోసం వైద్య సిబ్బంది, ప్రజలు భాగస్వామ్యంతో పనిచేయాలని కోరారు. ఆస్పత్రికి అవసరమయ్యే గదుల ఏర్పాటు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, కుత్తుం లక్ష్మణరావు, దువ్వాడ సంతోష్ నాయుడు, వైద్యాధికారులు టి.సునీల్‌కుమార్, మౌనిక, ఫార్మసీ ఆఫీసర్ బోనెల గోపాల్, సూపర్‌వైజర్ రిషికేశ్వరరావు, సత్యవతి, ఆదిమ్మ, విమలాదేవి, ఈశ్వరమ్మ, మేరీబాయ్, కామేశ్వరరావు, సుదర్శన్, ఎంపిటిసి మాజీ సభ్యులు మోహనరావు, డొక్కరి సత్యనారాయణ, భగీరథి పాల్గొన్నారు. అలాగే మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో రూ.60 వేలుతో పూణేకి చెందిన వైఫోర్డి ఫౌండేషన్, హిందూస్తాన్ కల్‌కత్తా బేవరేజెస్ సంస్థ, గ్లో సంయుక్తంగా బహూకరించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.రమణారావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆర్.బాలశంకర్, అగ్నికుల క్షత్రియ బోర్డు డైరెక్టర్ కుత్తుం లక్ష్మణ్, వడ్డీ యాదగిరి, ఆర్.సుధాకర్, ఆళ్ల కృష్ణారావు, బి.ఆనందరావు, దువ్వాడ సంతోష్‌కుమార్, ఆళ్ల వెంకటరావు పాల్గొన్నారు.

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, ఈ ఏడాది వేసవి నుంచి తాగునీటి ఎద్దడి నివారించి తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం వద్ద గల వాటర్ సప్లయి ఇంటర్ కనెక్షన్ జాయింట్ అక్కుపల్లి రోడ్డు కూడలి, ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు నుంచి మున్సిపాలిటీకు సరఫరా చేసేందుకు మంచినీటి సరఫరా ప్రాజెక్టు పనులను కమిషనర్ ఎన్.రామారావుతో పరిశీలించారు. మాట్లాడుతూ ఉద్దానం మంచి నీటి ప్రాజెక్టు నుంచి మున్సిపాలిటీకు తాగునీరు మళ్లించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, ఆర్‌డబ్ల్యుఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆశారాణి, మున్సిపల్ డిఇ కనకరాజు, ఎఇ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- కవిటి

ఉద్దానం ప్రాంతం రైతాంగ సమస్యలు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ల రాజేష్ తెలిపారు. స్థానిక లోళ్ల నారాయణమూర్తి కళ్యాణ మండపంలో మంగళవారం రైతులు రాజేష్‌ను కలిసి రైతాంగ సమస్యలు వివరించారు. ముఖ్యంగా 1999లో వచ్చిన సూపర్ సైక్లోన్ అనంతరం రైతు తిరోగమనలో పయనిస్తున్నాడని వివరించారు. ప్రస్తుతం ఉద్యానవన పంటలకు అనేక చీడపీడలు అనావృష్టి కారణంగా తగ్గిన దిగుబడులతో రైతులు దయనీయ జీవితాలు గడుపుతున్నట్టు తెలిపారు. ఉద్యానవన పంటలైన కొబ్బరి, జీడికి మద్దతు ధర కల్పిస్తే రైతుకు కొంత ఊరట లభిస్తుందన్నారు. దీనిపై స్పందించిన రాజేష్ స్పందించారు. కార్యక్రమంలో పండి సత్యనారాయణ, మొగలిపురి సింహాచలం, పిన్నింటి జైరావు, గొండ్యాల భాస్కరరావు, ఆరంగి వెంకటరావు, మొగిలిపురి సీతాలు పాల్గొన్నారు.

రాజేష్‌ను కలిసిన రైతులు

బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు

సిఐ శ్రీనివాసరావు

నరసన్నపేట : బెట్టింగ్‌తో జీవితాలు నాశనం చేసుకోవద్దని సిఐ జె.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. క్రికెట్ బెట్టింగ్ పాల్పడుతున్న నిర్వాహకులపై నిఘా పెట్టామన్నారు. దొరికితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు హెచ్చరించారు. క్రికెట్ మ్యాచ్‌లు వినోదం కోసం మాత్రమేనని అన్నారు. ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లపై దృష్టిసారించామన్నారు.

క్రైమ్ కార్నర్

ఆనందరావు మృతదేహం

విద్యుదాఘాతంతో ఉద్యోగి మృతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని జిల్లా పరిషత్ రోడ్‌లో ఉన్న గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం పర్యవేక్షణ ఇంజినీర్ వారి కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.ఆనందరావు (47) విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే... నగరంలోని దేసెల్లవీధికి చెందిన ఆనందరావు గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం పర్యవేక్షణ ఇంజినీర్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే ఉదయం 10 గంటలకు కార్యాలయానికి చేరుకుని నీటి ట్యాంకును నింపేందుకు మోటారు ఆన్ చేశారు. ట్యాంకు నిండిపోవడంతో మోటర్ ఆపేందుకు వెళ్లిన ఆనందరావు విద్యుదాఘాతంతో గురైనట్టు తెలుస్తోంది. మోటర్ ఆపేందుకు వెళ్లిన ఆనందరావు ఎంతసేపటికి రాకపోవడంతో తోటి అటెండర్ శార్వాని వెళ్లి చూడగా... ఆనందరావు అచేతనంగా పడి ఉండడాన్ని గమనించింది. వెంటనే ఆమె కార్యాలయ సిబ్బంది 108 వాహనానికి సమాచారం అందజేశారు. సిబ్బంది వచ్చి ఆనందరావుని పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ ఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. మృతునికి భార్య దుర్గ, కుమార్తె కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గత పదేళ్లుగా ఇదే కార్యాలయంలో ఆనందరావు విధులు నిర్వహిస్తుండడంతో తోటి సిబ్బంది ఆయన మృతి విషయం తెలుసుకొని దిగ్భ్రాంతికి గురయ్యారు.

చీడివలసలో యువకుడు...

మణికంఠ (ఫైల్)

బూర్జ : నాన్న రాత్రి, పగలు ఆటో తిప్పుతూ కుటుంబాన్ని పోషిస్తున్నావ్... బాధపడకు నాన్న... త్వరలో నేను ఏదైనా ఉద్యోగం చేస్తాను మన కుటుంబానికి ఆసరాగా ఉంటానని భరోసా ఇచ్చిన కొడుకు తమ కళ్లముందే విద్యుదాఘాతానికి గురై విలవిలలాడుతూ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

మండలంలోని చిడివలసలో ఐటిఐ చదువుతున్న విద్యార్థి బూరి మణికంఠ (20) మంగళవారం తన మేడపైన ఉన్న ఇనుప నిచ్చెనను కిందకు దించేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో చీడివలస నుంచి లాభంకు వెళ్తున్న విద్యుత్ ప్రధాన వైర్లకు ఇనుప నిచ్చెన తాకడంతో మణికంఠ విద్యుత్ షాక్‌కు గురై విలవలలాడారు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు 108లో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మార్గంమధ్యలో పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడు ఆమదాలవలసలో సిద్ధార్థలో ఎలక్ట్రికల్ ఐటిఐ రెండో సంవత్సరం చదువుతున్నారు. మృతుడికి తల్లిదండ్రులు కీసరమ్మ, దుర్గారావు, చెల్లెలు ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

గంజాయితో ముగ్గురు అరెస్టు

పలాస : పలాస రైల్వేస్టేషన్‌లో 14.8 కేజీల గంజాయితో ముగ్గురుని అరెస్టు చేశామని సిఆర్‌పిఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె.షరీఫ్ మంగళవారం తెలిపారు. రైళ్లలో ముమ్మరంగా తనిఖీ చేస్తుండగా... తమిళనాడు రాష్ట్రానికి చెందిన త్యాగు, విఘ్నేష్, అజిత్ ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి నుంచి తరలిస్తున్నారని అన్నారు. తనిఖీల్లో పట్టుబడిగా గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశామన్నారు.

ముగ్గురు అరెస్టు

ఆమదాలవలస : పట్టణంలో కంద్రపేట వద్ద ఉన్న శ్మశాన వాటిక వద్ద గతేడాది అక్టోబరు 27న ఏడుగురు వ్యక్తులు ఐదు కేజీల గంజాయి రవాణా చేశారని ఎస్ఐ బాలరాజు తెలిపారు. సమాచారం అందుకున్న అప్పటి ఎస్ఐ కె.వెంకటేష్ పోలీస్ సిబ్బంది వెళ్లి నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నించారని అన్నారు. అప్పట్లో నలుగురు నిందితుల ను పట్టుకున్నారని, ముగ్గురు పరారయ్యా రని అన్నారు. ఆ పరారైన ముగ్గురు నిందితులను మంగళవారం అరెస్టు చేశామన్నారు. శ్రీకాకుళం నానుబాల వీధికి చెందిన తమ్మినేని సాయి, దమ్ముల వీధికి చెందిన మైపల్లి రాంబాబు, వాంబే కాలనీకి చెందిన పాలకొండ చిన్నగా గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. నిందితులను స్థానిక కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

దాడులు అమానుషం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వైసిపి కార్యకర్తలపై టిడిపి కార్యకర్తలు దాడులు చేయడం అమానుషమని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు సిఐ మీసాల చిన్నంనాయుడును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యకర్తలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో వైసిపి కార్యకర్తలపై దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, వైసిపి నాయకులు సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, సెల్లా దేవరాజు, పి.రాజశేఖర్‌రెడ్డి, కె.మోహనరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా

'ఉపాధి' పనులు పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఉపాధి హామీ పనుల్లో కూలీలు స్నేహపూర్వకంగా మెలగాలి, నాణ్యతయుతంగా పనులు చేసుకోవాలని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎపిఒ రవి అన్నారు. మెళియాపుట్టిలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మస్తరు ప్రకారం కూలీల వివరాలను, పనిప్రదేశాన్ని పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేసుకుని కనీస కూలి పొందాలన్నారు. ప్రతి కుటుంబానికీ వంద రోజులు పనులకు హాజరు కావాలన్నారు. ఈయనతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీరామ్ చాణిక్య పాల్గొన్నారు.

నోటీసు అందజేస్తున్న వార్డు మెంబర్లు

ఉప సర్పంచ్‌పై అవిశ్వాస తీర్మాన నోటీసు

ప్రజాశక్తి- నరసన్నపేట

ఓ పార్టీ బ్యానర్‌పై గెలిచి... మరో పార్టీలో చేరి... ఇప్పుడు మేజర్ పంచాయతీ పరిపాలనకు ఆటంకంగా మారిన నరసన్నపేట మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబుపై పాలకవర్గ సభ్యులు ధ్వజమెత్తుతున్నారు. ఏకంగా మంగళవారం శ్రీకాకుళం ఆర్‌డిఒ కార్యాలయానికి వెళ్లి 16 మంది సభ్యులు సంతకాలతో కృష్ణబాబుపై అవిశ్వాస తీర్మాన నోటీసును అందజేశారు. పంచాయితీ పాలనకు వ్యతిరేకంగా పనులు చేస్తున్న ఉప సర్పంచ్ వ్యవహారం మాకు నచ్చడం లేదని.. వెంటనే ఆయనను పదవి నుంచి తొలగించాలని కోరుతూ అవిశ్వాస తీర్మానాన్ని అందజేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు కోరాడ చంద్రభూషణ గుప్తా, రఘుపాత్రుని శ్రీధర్, బంకుపల్లి శర్మ, ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు, మాజీ చైర్మన్ రాజాపు అప్పన్న, ఎంపిటిసి బగ్గు రమణయ్య, నేతింటి రాజేశ్వరరావు, మాజీ డైరెక్టర్ బబ్బోది ఈశ్వరరావు, సత్తివాడ రామినాయుడు, తోట భార్గవ్ పాల్గొన్నారు.

30న ఉగాది పురస్కారాలు

అరసవల్లి: నగరంలోని అరసవల్లి ఆదిత్య నగర్ కాలనీ మణిపాత్రుని క్రియేటివ్ అకడమీ (ఎంసిఎ) కేంపస్‌లో ఈనెల 30న ఉగాది సందర్భంగా వివిధ రంగాల్లో లబ్ధ ప్రతిష్టులకు రాష్ట్రస్థాయి పురస్కారాలను ప్రదానం చేస్తామని ప్రతినిధులు భాగ్యలక్ష్మి, నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బాలరంజని సంస్థ ఆధ్వర్యాన వివిధ నైపుణ్యాల్లో ప్రతిభ సాధించిన బాలలకు పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

కూటమి ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడం, తద్వారా విద్యార్థులు స్వశక్తితో ఆర్థిక అభివృద్ధి చెందుతారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో పాల్గొని మాట్లాడారు. వృత్తి విద్య నైపుణ్యం, స్వయం ఉపాధికి, పారిశ్రామికవేత్తలుగా తయారు కావడానికి దోహదపడతాయని అన్నారు. ఎక్కువగా ఐటిఐ చేసిన విద్యార్థులకు జాబ్ ఓరెంటెడ్ కోర్సుగా మంచి అవకాశాలు వస్తాయని తెలిపారు. జాబ్‌మేళా ద్వారా కొంత మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని, వివిధ కార్పొరేట్ సంస్థలు, ఫార్మా కంపెనీలు అపోలో, సీనర్జీస్, వంటి అనేక సంస్థలు నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఉద్యోగ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ముగిసిన పైడితల్లమ్మ జాతర

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు మండల కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పైడితల్లి అమ్మవారి జాతర మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మూడో రోజు వేకువ జామున నుంచే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా ప్రాంతాలకు చెందిన వేలాదిమంది యాత్రికులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎటువంటి అల్లర్లు చోటు చేసుకోకుండా ఎస్ఐ సత్యనారాయణ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యాత్రకుల దాహార్తిని తీర్చడానికి తెలగ సంక్షేమ సంఘం, భాష్యం స్కూల్, కళింగ కోమటి సంక్షేమ సంఘం, ధ్యాన ఆరోగ్య కేంద్రం, మల్లికార్జునస్వామి ఆలయాల ప్రతినిధులు మజ్జిగ పంపిణీ చేశారు. జాతరకు వచ్చిన యాత్రికులుకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కమిటీ సభ్యులు అడుగడుగునా మౌలిక సౌకర్యాలను కల్పించారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న సంఘం సభ్యులు

విగ్రహాల వార్షికోత్సవం...

ఇచ్ఛాపురం : స్థానిక స్వేచ్ఛావతి కృష్ణశిల విగ్రహ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా పూజలు నిర్వహించి విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని యాత్రికులు పాల్గొన్నారు.

కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

వికలాంగులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జెమ్స్ వైద్య కళాశాల, ఆస్పత్రి ఆర్థిక సాయంతో జిల్లాలోని మూగ, చెవిటి వైకల్యం ఉన్న వారికి వివిధ పరికరాల కిట్లను ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం అందజేశారు. సామాజిక బాధ్యతతో వికలాంగులకు పరికరాలు అందించడం శుభ పరిణామమన్నారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహననాయుడి సహకారంతో ఏటా వికళాంగుల కోసం శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆర్థిక స్థోమత లేక పరికరాలను కొనుగోలు చేసుకోలేని అనేక మంది వికలాంగులకు ఇది ఎంతో సహకారమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ అవకాశాన్ని వికలాంగులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెమ్స్ యాజమాన్య ప్రతినిధులు డాక్టర్లు మెండ ప్రవీణ్, మిశ్రా పాల్గొన్నారు.

తాళ్లభద్రలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని తాళ్లభద్రలో ఎఒ నరసింహమూర్తి ఆధ్వర్యాన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగు చేస్తున్న వేరుశనగ పంటను పరిశీలించారు. పంటకు తామర పురుగు ఆశించినట్లు గుర్తించి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. సాగు పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్.సాయికుమార్, వి.జగన్నాథం, వి.సూర్యారావు, జోగారావు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కార్యదర్శి ప్రసాద్

అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

అనుమతులు లేకుండా ఎటువంటి నిర్మాణాలు చేపడితే వారిపై చర్యలు తప్పవని గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ హెచ్చరించారు. జె.ఆర్.పురం కాలనీలో అనుమతులు లేకుండా జనవాసాల మధ్య నిర్మాణం చేస్తున్న కోళ్ల ఫారం, కోళ్ల నిల్వ కేంద్రంపై అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవాసాల మధ్య కోళ్ల ఫారాలు, నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయరాదని సూచించారు. చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు తాను పరిశీలంచానని అన్నారు. ఈయనతో పాటు పారిశుధ్య శానిటేషన్ మేస్త్రి పాణి కుమార్, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

విద్యా వ్యవస్థ బలోపేతం

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 117 జిఒను కూటమి ప్రభుత్వం రద్దు చేస్తూ విద్యా వ్యవస్థని బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని రూరల్ ఎంపిడిఒ కార్యాలయంలో పాఠశాలల యాజమాన్య కమిటీలు, ప్రధానోపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు విధాలుగా విద్యా విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ఫౌండేషన్ కోర్సు బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరీ, హైస్కూల్ విద్యా విధానం ద్వారా విద్యా బోధన నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు. ఈ తరహా విద్య విధానం వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. పాఠశాలలో విద్యాబోధన, విద్యా విధానంలో మార్పు వస్తుందన్నారు. సమావేశంలో ఆర్‌డిఒ సాయిప్రత్యూష, డిప్యూటీ డిఇఒ విజయలక్ష్మి, ఎంపిడిఒ బొడ్డేపల్లి శైలజ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

మెళియాపుట్టి: మండలంలోని హడ్డివాడ గిరిజన గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తడంతో మంగళవారం ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఉదయ్ కుమార్ మంగళవారం సందర్శించారు. తాగునీటి బావి నీరు అడుగంటి పోవడంతో ప్రత్యామ్నాయంగా ట్యాంకుద్వారా నీటిని సరఫరా చేసేందుకు నిర్ణయించారు. అలాగే బోర్‌వెల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. అనంతరం అసంపూర్తిగా నిలిచిపోయిన పాఠశాల నిర్మాణాన్ని పరిశీలించారు. విద్యార్థులు చదువు కోసం కొండ దిగువన ఉన్న కొల్లివలస వెళ్లవలసి వస్తుందని, అసంపూర్తి భవనం పూర్తయితే పాఠశాలకు వసతి సౌకర్యం కలుగుతుందని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శిమనోహర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బావిని పరిశీలిస్తున్న అధికారులు

మాట్లాడుతున్న సిఐ తిరుపతిరావు

ఉన్నత వ్యక్తిత్వం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రతి విద్యార్థీ ఉన్నత వ్యక్తిత్వం అలవర్చుకోవాలని కాశీబుగ్గ రూరల్ సిఐ తిరుపతిరావు అన్నారు. మండలంలోని పూండిలోనిసాయి వినీత్ విద్యా సంస్థ మంగళవారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. స్వీయ నియంత్రణ పాటిస్తే భవిష్యత్ అద్భుతంగా ఉంటుంద న్నారు. మహిళను గౌరవించే సంస్కృతిని అలవాటు చేసుకొని వారికి వ్యతిరేకంగా జరుగుతున్న హింసను అరికట్టాల్సిన బధ్యత అందరిపైనా ఉందని అన్నారు. విద్యార్థి దశ నుంచి తమ బాధ్యతలు తెలుసుకుని ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ జిన్నారావు, ప్రిన్సిపాల్ ఎ.కైలాసరావు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చిన్నబగ్గ పంచాయతీ, సంకిలిలో బిడ్డిక భాస్కారావు పొలంలో ఎఆర్ఎస్ సీనియర్ సైంటిస్ట్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కొర్ర, రాగి పంటలు కోతలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిరి ధాన్యాలు ప్రాముఖ్యత కోసం రైతులకు వివరించారు. పూర్వం గిరిజనులు ఎక్కువగా చిరుధాన్యాలు పండించి ఆరోగ్యంగా, బలంగా ఉండి ఎక్కువ కాలం బతికేవారని అన్నారు. ప్రస్తుతం బయట ఆహార అలవాట్లు పెరగడం వల్ల సమాజంలో జబ్బులు పెరిగి ఆసుపత్రి వైపు మలుసున్నారని చెప్పారు. దీనివల్ల ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించి ఉన్నారు. ప్రస్తుతం గిరిజనులు పండించే పంటలు దేశం మొత్తం పండించి ఆరోగ్యంగా, బలంగా, ఉండి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రభుత్వాలు ఆలోచనాలు చేస్తున్నాయని, దీన్ని అర్థం చేసుకొని రైతులు ముందుకు వెళ్లాలని అవగాహన కల్పించారు. చిరుధాన్య విత్తనాలు నిల్వ చేసుకుని గిరిజన గ్రామాలన్నీ ఈ పంటలు వేసి ఆరోగ్యంగా ఉంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమం లో వెలుగు అసోసియేషన్ ఏరియా కోఆర్డినేటర్ పాలక నాగేశ్వరరావు, రైతులు మండంగి కృష్ణారావు, బిడ్డక భాస్కరరావు, సవర సురేష్ పాల్గొన్నారు.

చెరువును పరిశీలిస్తున్న అధికారులు

అధికారుల పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని చెరువుకు సంబంధించి సుందరాడ, మాకనాపల్లి గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్‌పండా, ఎస్ఐ పి.రమేష్‌బాబులు మంగళవారం పరిశీలించారు. వ్యవసాయ పంట పొలాలను, చెరువు నీటి సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రస్తుత వేసవి దృష్ట్యా చెరువులోని నీటినిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నీటి కోసం ఎటువంటి వివాదాలకు గురికావద్దని సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్యామల రావు, మకనాపల్లి సర్పంచ్ తాడేల రామరాజు, సుందరాడ మాజీ సర్పంచ్ ఎస్.రామ్మోహనరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హెచ్‌ఎం గోవిందరావు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కోటబొమ్మాళి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య ప్రధానోపాధ్యాయులు జె.గోవిందరావు తెలిపారు. కోటబొమ్మాళిలో కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయ సిబ్బంది మంగళవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చినసాన, గుడివాడ, మదానాపురం తదితర గ్రామాల నుంచి విద్యార్థులు తమ సొంత డబ్బులు వెచ్చించి ఆటోలో వస్తున్నారని అన్నారు. పదో తరగతిలో శతశతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నామని తెలిపారు. సెలవు రోజుల్లో సహపాఠ్య అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు.

ఘనంగా సిరిమానోత్సవం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని పోలవరంలో మంగళవారం పాసిపోలమ్మతల్లి సిరిమాను ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దల పర్యవేక్షణలో ఉత్సవాల చివరి రోజు గ్రామ పురవీధుల్లో సిరిమానును తిప్పి ఊరేగించారు. తొమ్మిదేళ్ల అనంతరం నిర్వహించిన ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గురువెల్లి బాలకృష్ణ, దవళ రమేష్‌కుమార్, మెట్ట చంద్రరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సిరిమానోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు